క్లుప్తంగా

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలో నాగుబండి రంగయ్య, అచ్చమ్మ బధిరుల పాఠశాలలో ప్రభుత్వ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థిని, విద్యార్థులు అందరికీ రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నలభైరోజుల పాటు పౌష్టికాహారం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ ఉమాదేవి, పంబి సదానందరెడ్డి, సభ్యులు కోమటి ఆంజనేయులు, కోడూరు సుబ్రహ్మణ్యాచారి, పాబోలు వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చీరాల టౌన్: చీరాల నియోజకవర్గంలోని చీరాల పట్టణం, వేటపాలెం మండలం, చీరాల రూరల్ మండలంలో ఉన్న అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఇతర గోడౌన్లు అన్నీ తమ వ్యాపార రిజిస్ట్రేషన్లు కార్మికశాఖలో చేయించుకోవాలని చీరాల కార్మిక అధికారి ఎస్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం ప్రతీ సంస్థ కార్మికశాఖలో నమోదును ఈనెలాఖరులోపు చేయించుకోవాలని ఆయన సూచించారు.

పేద విద్యార్థులకు ప్రైవేటులో ఉచిత సీట్లు

కారంచేడు: గ్రామాల్లోని పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అభ్యసించేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతున్నామని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వరావులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబానికి చెందిన వారికి 25 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. వీటిలో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు 6 శాతం, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధితులకు 5 శాతం సీట్లను కేటాయిస్తారన్నారు. ఉచితంగా సీట్లు పొందిన వారికి సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్, ఐబీ సిలబస్‌లు బోధించే సమీప ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు పొందేందుకు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ లోపుగా దరఖాస్తులు అందించాలన్నారు. దరఖాస్తులతో పాటు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, ఫొటో తీసుకొని సమీప గ్రామ సచివాలయం, నెట్ సెంటర్లలో అర్జీలు పెట్టుకోవాలన్నారు. 2017 ఏప్రిల్ 2వ తేదీ నుంచి 2018 మార్చి 31వ తేదీలోగా జన్మించిన వారికి మాత్రమే అర్హులన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు రోటరీ ప్రోత్సాహకం



చీరాల అర్బన్: పాండిచ్చేరిలో ఈనెల 27 నుంచి జరగనున్న తైక్వాండో పోటీలలో పాల్గొనే చీరాల చెందిన నలుగురు క్రీడాకారులకు రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదును సోమవారం క్లబ్ ప్రతినిధులు అందించారు. చీరాలకు చెందిన భానురేఖ, సాయిప్రియ, మల్లేశ్వరమ్మ, వినీతలు బీటెక్ చదువుతున్నారు. ఇటీవల నంద్యాలలో జరిగిన తైక్వాండో పోటీలలో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. ఈనెల 27న పాండిచ్చేరిలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఖర్చుల నిమిత్తం రూ.8500 ఆర్థిక సహకారాన్ని అందించారు. ఆరోగ్యం, ఆత్మరక్షణ కొరకు, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కోసం తైక్వాండో శిక్షణ ఉపయోగపడుతుందని క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, బండారుపల్లి హేమంత్ కుమార్, దోగుపర్తి వెంకట సురేష్, కోచ్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

చినగంజాం: రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని చినగంజాం రైల్వే బోర్డు మెంబర్ కమిటీ సభ్యులు షేక్ జిలాని, కోలా సుబ్బారావు, కందుకూరి పద్మావతి, మరపాల అంజిరెడ్డి,మన్యం అంకమ్మరాజులు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ కే శ్రీనివాసరావుకు విన్నవించారు. సోమవారం ఉప్పుగుండూరు రైల్వే స్టేషన్‌లో రైల్వేస్టేషన్ అండర్‌పాస్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభోత్సవం సందర్భంగా విచ్చేసిన ఆయనను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. చినగంజాం పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే స్టేషన్ చినగంజాం అని ఇంకొల్లు, నాగులుప్పలపాడుకు సంబంధించి సుమారు 1.50 లక్షల మంది ప్రజలకు కేంద్ర స్థానం అని తెలిపారు. గతంలో ఉన్న ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, రిజర్వేషన్ కౌంటర్, సర్కార్ ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపులను పునరుద్ధరించాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

● వలంటీర్లకు వందనంలో సమన్వయకర్త యడం బాలాజీ


కారంచేడులో వలంటీర్లను అభినందిస్తున్న సమన్వయకర్త యడం బాలాజీ

కారంచేడు: రాష్ట్రంలో పేద ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే సంకల్పంతో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడులో దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను ఆయన శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పేద ప్రజలకు అందించాల్సిన రైస్ కార్డులు, పింఛన్లు, నివాస గృహాలతో పాటు, అనేక రకాల సర్టిఫికెట్లు వంటివి ఏమి అవసరమైనా వలంటీర్లు ఇళ్లకు వెళ్లి ఎలాంటి లాభాపేక్షలు లేకుండా ఉచితంగా పథకాలు అందించడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఇంతటి సేవా దృక్పథంతో పనిచేసే వలంటీర్లను సత్కరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరావు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పోరాడింది వలంటీర్‌లే..

పర్చూరు (చినగంజాం): ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్‌లు అని రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశ పెట్టిన వాలంటీర్ వ్యవస్థ చాలా గొప్పదని పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త యడం బాలాజీ అన్నారు. పర్చూరు అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపం నందు సోమవారం నిర్వహించిన వాలంటీర్‌కు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వలంటీర్‌లకు సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వారికి బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఎంపీపీ మేకా ఆనందకుమారి, గాజుల రమేష్, ముప్పాళ్ల రాఘవయ్య, దాసరి వెంకటరావు, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి, యద్దనపూడి హరిప్రసాద్,పేరం సుబ్బారావు, పాలేరు వీరయ్య, షేక్ కాలేషా, కంచెనపల్లి రమేష్, గాదె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు రూ.5 వేలు

నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి వారి ఇంటిలో ఎవరైనా చనిపోతే వారికి తన తండ్రి యడం చినరోశయ్య పేరు మీద మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5 వేలు అందజేయనున్నట్లు యడం బాలాజీ ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు తీసుకొని కార్యాలయానికి వస్తే వారికి వెంటనే నగదు అందజేస్తామని, కార్యక్రమాన్ని వెంటనే అమలు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.


హాజరైన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది


పర్చూరులో మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ క్యాలండర్ అందిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

● గడప గడపలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

వేటపాలెం: రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దేశాయిపేట పంచాయతీ సచివాలయం 3, 4 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. మీ వార్డుల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా కలసి చెప్పవచ్చని సూచించారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించాల్సిన గడప గడపకు కార్యక్రమంలో కొన్ని ప్రాంతాల్లో తిరగలేక పోవడంతో ప్రస్తుతం నేరుగా లబ్ధిదారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈప్రభుత్వంలో ప్రతి పేదవాడికి లబ్ధిచేకూరిందన్నారు. పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్నను తిరిగి సీఎం చేయాలని సూచించారు.


హాజరైన ప్రజలు

చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసే విధంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు ఎన్నికలు వస్తున్నాయని లేనిపోని హామీలు గుప్పిస్తుంటారన్నారు. వీటిని మీరు నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఆర్బస్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్‌రావు, మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, మద్దులూరి సీతామహలక్ష్మి, కర్ణ లక్ష్మారావు, జిడుగు మస్తాన్, కంచి సాంబిరెడ్డి, పి శ్రీనివాసరెడ్డి, దంతం హనుమంతరావు, ఏపీఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో రూతమ్మ, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలిచిన జగనన్నదే విజయం


గ్రామస్తులకు అభివాదం చేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

● నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: పేదలకు, పెత్తందార్లకు మధ్య ఈ యుద్ధంలో పేదల పక్షాన నలిచిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే విజయమని, ఆయనను దించటం ఎవరి వల్ల కాదని అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలవలపాడు గ్రామంలో సోమవారం రచ్చబండ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్న హనిమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నప్పటి నుంచి పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవయస్థ, నవరత్నాలు, వలంటీరు వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయం వస్తుండటంతో మరలా మోసం చేసేందుకు చంద్రబాబు మోసపూరిత హామీలతో ముందుకుస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మఒడిని చూసి, అమ్మకు వందనం పేరుతో ప్రజలను ఏమార్చాలని చూస్తున్నాడని ఆరోపించారు. మోసం చేయడం చంద్రబాబు లక్షణం అయితే, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి లక్షణమని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావల్సిన బాధ్యత లబ్ధి పొందిన ప్రతి ఓటరుపై ఉందన్నారు.


అలవలపాడులో సచివాలయం ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

తోడుదొంగలు ఒక్కటయ్యారు..

నియోజకవర్గంలో తోడు దొంగలు ఒక్కటౌతున్నారు. అందరు ఒక్కటైన ప్రజలు వైఎస్సార్ సీపీ పార్టీ వెంటే ఉన్నారన్నారు. అద్దంకి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల రుణం తీర్చుకుంటాని ఆయన తెలిపారు. నియోజక వర్గంలో జరిగే సిద్ధం సభకు ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, సర్పంచ్ జక్రిన్, ఎంపీటీసీ నన్నేసా, ప్రచార కమిటీ అధ్యక్షుడు లోకిరెడ్డి రమణారెడ్డి, అలవలపాడు గ్రామ నాయకులు రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రామారావు, సయద్, నరేంద్ర, నవిన్, శేషయ్య, పెద్దన్న, జానిభాష, బాషా, నాగులు, నాగేశ్వరావు, సుబ్బారావు మండల నాయకులు గాదే బ్రహ్మారెడ్డి, బ్రహ్మారెడ్డి, బీసీ సెల్ కన్వినర్ చక్రవరం భాస్కర్‌రాజు, యల్లమందరావు, రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు తలలు, నాలుగు కాళ్లతో పుట్టిన దూడ


మృతి చెందిన దూడ

జే.పంగులూరు: మండల కేంద్రం అయిన పంగులూరు గ్రామంలో సోమవారం ఓ గేదెకు వింతైన దూడ జన్మించింది. రెండు తలలు, నాలుగు కాళ్లతో జన్మించి పుట్టిన కొద్ది సేపటికే ప్రాణాలు కోల్పోయింది. గ్రామానికి చెందిన రాయిణి రాఘవయ్య అనే రైతుకు చెందిన చూడి గేదె సోమవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఈనేందుకు సిద్ధం అయ్యింది. గ్రామంలో పశువైద్యుడు అందుబాటులో లేకపోవడంతో వెంటనే అక్కడ ఉన్న రైతులే గేదె ఇనేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. గేదే ఎంత సేపటికి నొప్పుడుపడుతున్నా దూడ బయటకు రాలేదు. కొంత సమయానికి దూడ కాళ్లు బయట పడ్డాయి. దూడ అడ్డం తిరిగిందని గమనించిన రైతు దూడ కాళ్లకు తాడు కట్టి అతికష్టం మీద బయటకు లాగారు. దూడ బయటకు వచ్చిన వెంటనే చనిపోయింది. కాని జన్మించిన దూడకు రెండు తలలు, ఎనిమిది కాళ్లు ఉన్నాయి. గేదె నొప్పులు చూడలేక బయటకు లాగామని రైతులు చెప్పున్నారు. పంగులూరు గ్రామంలోని పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్ లేకనే ఈ పరిస్థితులు ఏర్పడతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యాలయానికి ప్రహరీ నిర్మించాలి

చినగంజాం: కస్తూర్బా బాలికా విద్యాలయం చుట్టూ ప్రహరీ లేక బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారని వారికి కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సుమాంజలి కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల పరిధిలోని పలుశాఖలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేజీబీవీ భవన సముదాయం 2011లో ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మాణం చేయలేదని, విద్యాలయంలో సుమారు 260 మంది బాలికలు విద్యనభ్యసిస్తూ అక్కడే వసతి గృహంలో ఉంటున్నారని, ప్రహరీ లేక వారంతా అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. పరిష్కారం చేయాలని సమావేశంలో ప్రిన్సిపాల్ అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. రైతులకు ప్రభుత్వం అందజేసే డ్రోన్‌లపై


కేజీబీవీ సమస్యను తీసుకొస్తున్న ప్రిన్సిపాల్ సుమాంజలి

సబ్సిడీ గురించి కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ షా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు, గ్రామ పంచాయతీలు పలు శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యూబీ ప్రసాదరావు, రెవెన్యూ డీటీ లక్ష్మి, అన్ని శాఖల అధికారులు, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

'పోతిన'కు విశిష్ట ప్రతిభా పురస్కారం

కారంచేడు: మండలంలోని పోతినవారిపాలెం గ్రామానికి చెందిన ఉత్తమ రైతు అవార్డు గ్రహీత పోతిన వెంకట్రావుకు ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారి సేవా నంది నేషనల్ అవార్డుల్లో భాగంగా విశిష్ట ప్రతిభ రత్న అవార్డు 2024ను సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ ఆబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు తీసుకున్నట్లు వెంకట్రావు తెలిపారు. అభ్యుదయ రైతుగా ఆయన వ్యవసాయంలో అనేక రకాల వంగడాలను పరిచయం చేయడమే కాకుండా, మిశ్రమ పంటలను సాగు చేసి వాటిల్లో అధిక దిగుబడులు సాధించిన ఘనత వెంకట్రావుకు దక్కుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఢీల్లీ హైకోర్టు మాజీ


అవార్డు తీసుకుంటున్న పోతిన వెంకట్రావు

జడ్జి డాక్టర్ జీ రామచంద్రయ్య, మందాడి కృష్ణారెడ్డి, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, కూచిపూడి నాట్య గురువు ఎస్వీ భారతి, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు పీ కృష్ణదాసుల చేతల మీదగా ఆయన ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

సిద్ధం సభకు ప్రజలు భారీగా రావాలి


సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త బాలాజీ, తదితరులు


సిద్ధం సభా స్థలిని పరిశీలిస్తున్న సమన్వయకర్త హనిమిరెడ్డి

● సిద్ధం వాల్ పోస్టర్ ఆవిష్కరించిన బాలాజీ

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో నాలుగో పర్యాయం నిర్వహిస్తున్న సిద్ధం మహాసభకు ప్రజలు భారీగా తరలి రావాలని పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆయన సిద్ధం సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో సుభిక్షమైన పాలన అందించిన సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి తిరిగి రాబోయే ఐదేండ్లలో ఇదే విధమైన సంక్షేమ ప్రభుత్వాన్ని అందించేందుకు సిద్ధం అయ్యారని అన్నారు. అందుకే రాష్ట్రంలో సిద్ధం మహా సభలు నిర్వహించడం ద్వారా నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారని తెలిపారు. మార్చి3న నిర్వహించే సిద్ధం భారీ బహిరంగ సభకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కఠారి అప్పారావు, ముప్పాళ్ల రాఘవయ్య, గోరంట్ల శివకుమారి, తులసి నాగమణి, గాదె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను పరిశీలించిన హనిమిరెడ్డి..


మేదరమెట్ల: మార్చి 3వతేదీన జరగబోయే సిద్ధం సభ స్థలాన్ని అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి సోమవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నాయకులకు పలు సూచనలు చేశారు.

ప్రతిష్ట మహోత్సవాలకు అంకురార్పణ


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

బల్లికురవ: బల్లికురవ గ్రామంలో వరసిద్ధి వినాయకుడి వాయు ప్రతిష్ట మహోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన వేదపండితులు చింతల పాటి మణిసూర్య సుబ్రమణ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో అన్నవరపు మణికంఠ బృందం విఘ్నేశ్వర పూజ, పుణ్యహవచనం, రక్షాబంధన, దీక్షాధారణతో యాగశాల ప్రవేశం చేశారు. అంకురార్పణ అఖండస్థాపన యాగ మండప ఆవాసన, వాస్తు మండప హోమం, వాస్తు హోమం ప్రధాన కలశస్థాపన చేపట్టారు. మంగళవారం హోమాలు జలాధి, ధాన్యాధి, పుష్పాధి, శయ్యాధివాసం, వరసిద్ధి వినాయకుని గ్రామోత్సవం బుధవారం ఉదయం 10 గంటలకు ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరారు.

వాలీబాల్ విజేతలకు అభినందనలు


విజేత క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు ప్రతిభ కనబరచి విజేతగా నిలించిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. రెండు రోజుల కిందట నరసరావుపేటలో నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా పోటీలు నిర్వహించారు. పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 21 కళాశాల నుంచి వాలీబాల్ జట్టు పాల్గొన్నాయని తెలిపారు. ఫైనల్‌లో ఒంగోలు పేస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టును ఓడించి విజేతగా నిలిచారన్నారు. విన్నర్స్‌గా నిలిచిన జట్టులోని క్రీడాకారులకు వ్యక్తిగత సర్టిఫికెట్లు బహూకరించినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, ఈఈఈ విభాగాధిపతి ఎస్ అనిల్‌కుమార్, మెకానికల్ విభాగధిపతి లక్ష్మితులసి, అభినందించారు.

చిదంబరేశ్వరుడిని అభిషేకించిన సూర్యకిరణాలు

చినగంజాం: స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్‌ను తాకి అభిషేకించాయి. ఆలయంలో సూర్యోదయం సమయంలో ఉదయం 7.05 నిమిషాల నుంచి 7.09 నిమిషాల వరకు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. మాఘ పూర్ణిమ సందర్భంగా సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. ఆలయ అర్చకులు కొల్లిపర వెంకట అప్పారావు ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఈ సుందర దృశ్యాన్ని కనులారా చూసి తరించారు.


శివలింగాన్ని తాకి అభిషేకిస్తున్న సూర్యకిరణాలు